# పుల్లయ్య పురాణం



కాసుమెల్ల నరసింహారావు

అందరం కూడా మైపాడు సముద్రపుటొడ్డున కూర్చునివున్నాము. వెన్నెల చాలా హాయిగా వుంది. పిచ్చాపాటి మాట్లాడుకోడానికి ఎంతో బాగుంది. ఆ వెధవపట్నపుగోల వదలి, ఇలా నెలకో మారైనా వస్తే బాగుండుననిపిస్తూంది మాకందరకూ. మామా జీవితాలలో మరచిపోలేని ఘట్టాలను గూర్చి చెప్పుకుంటున్నాము. ప్రతి వారివంతూ అయిపోయింది. ఇక పుల్లయ్యగారే మిగిలేరు. వారు మా పెద్దగుమాస్తా. అసలు మొదటనే అడిగేము ఆయన్ని చెప్పమని. కానీ, మేమందరము చెప్పిన తర్వాత కానీ, ఆయన చెప్పనన్నారు. అందరమూ, 'ఇక మీసంగతి కానివ్వండి పుల్లయ్యగారూ' అన్నాము. పుల్లయ్యగారు ప్రారంభించేరు.

'అయినా, జీవితములో ఏవిషయాన్ని కూడా నేను మరచిపోలేదు. అది ఎందుచేతనో కూడా నేను చెప్పలేను. నా జీవితములో జరిగే ప్రతి విషయమూ ముఖ్యమయిందో లేక ప్రతి విషయానికీ ప్రాముఖ్యం యిచ్చే స్వభావమో నాది— ఏదైంది ఇప్పటివరకు తేలలేదు. ఆ ప్రశ్నకు జవాబు తర్వాత ఆలోచించవచ్చు కానీ; ఇప్పుడు మన ఆఫీసులో నేను చేరిన క్రొత్తలో జరిగిన సంగతి నొక విషయాన్ని చెప్తా. ఆ విషయము జరిగి ఇరవై ఏండ్లు పైగా అయినా, ఈనాటికీ అది సమస్యగానే వుండిపోయింది. ఏ సమస్యనయినా కాలము పరిష్కరిస్తుందన్న విషయములో గట్టి నమ్మకమున్నవాళ్ళలో నేనొకడిని. కానీ, దీన్ని పరిష్కరించగలదా అనేది సందేహంగా వుంది. అసలుసంగతికె వస్తాను. నేను మన ఆఫీసులో ఛార్జి పుచ్చుకున్న మొదటిరోజులవి. అప్పుడు ఆఫీసరు ఎవరుచెప్మా? వెంకట్రామయ్యరో, వెంకటేశ్వరయ్యంగారో? వీరిద్దరిలో ఎవరూ? సరే, ఆ పేరుకూ మనకథకూ అట్టే సంబంధము లేదుకనుక ఆయన పేరు వెంకట్రామఅయ్యరు అనుకుందాము. నేనుఆఫీసుకు ఆరోజునుంచి ఈరోజువరకూ ఎప్పుడూ ఆలస్యంగావచ్చింది లేదు. సరిగా 10-48, 10-50 మధ్యవచ్చేస్తా. అయినా ఆరోజు (ఈ సంగతి జరిగినరోజు) ఎన్నిగంటలకు వచ్చేనో గుర్తులేదు. మనకథ నడిచేందుకుగాను 10-48 కి వచ్చేననుకుందాము. 10-45 అని ఎందుకు అంటున్నానో ఎవ్వరైనా గ్రహించారా. అయినా నువ్వుచెప్పు, మాద్దాము' అంటూ నావేపు చెయ్యిమాపెట్టాడు.

'ఎందుకయినా కానిద్దురూ, మీ కథను సాగిద్దురూ' అన్నాను నేను.

'సరే, ఇప్పుడు అదంతా చెప్తూ కూర్చుంటే కాదుకానీ, 10-48 కి ఆఫీసుకి వచ్చేను. వచ్చి రాకముందరే నన్ను ఆఫీసరు పిలిపించేడని కబురు. వెంకడో, సుబ్బడో - ఎవరబ్బా! నాకీకబురు తెచ్చింది? ఒరే వెంకా, నీకు గుర్తుందిటరా? నువ్వేనా ఆరోజు నన్ను పిల్చింది' అన్నాడు దూరంగావున్న వెంకడివేపు చూస్తూ.

'నేనుకాదండి' అని జవాబిచ్చేడు వెంకడు, తప్పించుకోడానికి.

'అయితే సుబ్బడయి వుంటాడు' అన్నారు, పుల్లయ్యగారు.

'అప్పటికి సుబ్బడు ఆఫీసులోనే చేరలేదు కాదుటండీ' అని అడ్డగించాడు వెంకడు.

'ఏడ్చావులేవోయ్, ప్రతిదానికి అడ్డముచెప్పడం మహా నేర్చుకున్నావు. ఈవెధవలిద్దరూ కాకపోతే, మనకథ నడవడానిగ్గాను వెంకటసుబ్బడనుకుందాము' అని సాగించబోతున్నారు పుల్లయ్యగారు. వెంకడు బిక్కమొహము వేసుకొని అక్కడనుంచి లేచి వెళ్ళబోయ్యాడు.

'వెంకా, ఇంతమాత్రానికే కోపంరావాలట్రా. అయినా, నువ్వెక్కడేవుండాలి. ఈ సమస్యను పరిష్కరిస్తే నువ్వే పరిష్కరించాలి. ఎందుచేత నంటావా, వీళ్ళందరూ నిన్నకాక మొన్న వచ్చిన కుర్రవాళ్లుకాదుట్రా? కూర్చో, కూర్చో' అంటూ ఉండగానే రామం అందుకొని 'సరే, 10-48 లకి ఆఫీసుకి దయచేశారు. వెంకటసుబ్బడు మిమ్మల్ని ఆఫీసరు పిలువనంపించేడని కబురందిచ్చేడు. తర్వాత?' అన్నాడు.

'తర్వాత! తర్వాత!! ఎందుకోయి ఆతొందర! ఏం? వానలో కూర్చొనివున్నావా? హాయిగా ఇక్కడ కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకొందామని వచ్చేది, చెప్తూండేవిషయాల రసాన్నంతా తర్వాతలతో పిండేసేది! ఏమిటో ఆతొందర! అర్థముకానితొందర!అయినా, ఎక్కడిదాకా వచ్చేమోయ్,'అంటూనావేపుప్రశ్నార్థకంగా చూశారు.

'రామం చెప్పేవేమీ కాదుటండీ మీరు చెప్పిందంతా సంగ్రహంగా' అన్నా.

'ఒరేయ్! నీక్కూడా పొగరెక్కిందిరా! కథ ఎంతవరకు సాగిందో చెప్పమంటే, రామంగాడు చెప్పేడంటావా? వాడొక కుర్రకుంక. వాడి మాటలనుకూడా మన్నించవలసిందేనా? చెప్పరా, కథ ఎక్కడవరకూ సాగిందో.'

'పుల్లయ్యగారూ, మీరు నోరు జారవిడుచుకుంటున్నారు. అనవసరంగా నన్ను రేపెట్టకండి. ఏదో మీరు మీ విషయాన్నేదో చెప్తూంటే దాంట్లో పటుత్వము పోకూడదని మీకంది స్తే' అని యింకా ఏమేమో అనబోతున్నాడు రామం.

నేనందుకుని 'ఒరేయ్, రామం! పుల్లయ్యగారు మాత్రము ఏమన్నారురా? నువ్వు మా అందరిలోకి జూనియరువి ఆయె! అందుకోసం ఏదో స్వతంత్రంగాఅంటే నువ్వింతగా బాధపడాలట్రా'అన్నా.

'అంతేనోయ్! రామం. నీమీద నాకేం కోపమా? ఊరికే ఏదో చిన్నవాడివి కదా అని అన్నాను. అంతేనా వెంకయ్యా, నువ్వు చెప్పు' అన్నారు పుల్లయ్యగారు.

'అంతే బాబు, అంతే. రామంబాబుగారు వయస్సులో చిన్నయినమూలాన్ని అలా ఉడుక్కుంటారు గానీ, వారికి మాత్రము మీమీద కోపమా' అని సర్దుబాటుచేశాడు మా జవాను, వెంకయ్య.

'సరే. కానివ్వండి, పుల్లయ్యగారూ. మీకథను సాగించండి' అన్నాడు రామం.

'ఎంతదాకా వచ్చానేమిటి?'అని ప్రశ్నించారు పుల్లయ్యగారు.

'మిమ్మల్ని ఆఫీసరు పిల్చేవరకు' అని అందిచ్చాను నేను.

'ఆఁ-వాడు, వెంకట్రామయ్యారో, వెంకటేశ్వర అయ్యాగారో నన్ను పిలిపించాడు. అప్పుడు, ఆ రోజుల్లో ఆఫీసరుగది ఇప్పుడు నేను కూర్చొండే గదిలోనో, లేకపోతే దక్షిణపు ప్రక్కగదిలోనో ...ఒరేయ్ వెంకా, నీకు గుర్తుందిరా?'

'అయ్య! ఏమన్నారూ?' అన్నాడు తూగు తూండే వెంకడు.

'నేను చేరినప్పుడురా, ఆఫీసరు ఏ గదిలో కూర్చునేవాడూ? ఇప్పుడు నేనుండేదాంట్లోనా, ఆ దక్షిణపుగదిలోనా?'

'రెండూకాదండీ! ఉత్తరదాంట్లోనో, పడమటిదాంట్లోనో—ఈరెంటిలో ఏదో బాబయ్యా'—

'సరే మీకథకోసం మీరు కూర్చునే గది అనుకుందాము' అన్నాడు రామం.

'అన్నట్లు ఆయన ఏగదిలో కూర్చొంటేనేం లే. నేను కూర్చొండేగదే ననుకుందాము. అయినా అది దక్షిణపువనేగుర్తు. జ్ఞాపకం తెచ్చుకోరా, వెంకా!' అంటూ వెంకణ్ణి మరోసారి హెచ్చరించాడు పుల్లయ్యగారు.

'నాకు బాగా గుర్తుందండీ! అది ఉత్తరపు గదో, పడమటిగదో' అన్నాడు వాడు.

'ఏడ్చినట్లేవుంది నీగుర్తు. ఏదో ఒకటి ఇదమిత్థమని తేల్చి చెప్పలేకపొయ్యావ్ ఏంగుర్తు.'

'మీరు కూర్చున్న గదనుకుంటే సరిపోదటండీ, ఇప్పుడు మీ కథావివరణకు' అని అడిగేను నేను.

'ఆ! సరిపోకేం? సరిపోతుంది. అయినా అదీ ఇది అని తేలకపోవడమేమిటా అని. మీరింతమంది చెపుతున్నారు కనుక అది నాగదే అనుకుందాము. అప్పట్లో ఆగదికి తడికె వకటి కట్టివుండేది. అది వట్టివేళ్ళదో, వెదురుబద్దలదో మరచిపొయ్యా. అయినా వుండండి....ఆహా! నేనుచేరింది ఎండాకాలమయితే, అది వట్టివేళ్ళదయి వుండాలి. శీతాకాలమయితే వెదురుబద్దలదయివుండాలి. ఏరా, వెంకా. నేను చేరింది శీతాకాలమో, వేసంగికాలమో చెప్పగలవ్వురా?'

'చెప్పలేకేమండీ! మీరు చేరింది ఎండాకాలములో కాదుటండీ' అన్నాడు వెంకడు.

'ఛా, ఎండాకాలమేమిటిరా, ఆరోజున వాన కురిస్తేను! నేను తడిసిముద్దయివచ్చాను కాదుట్రా, ఆనాడు ఆఫీసుకి? మరచిపోయ్యావట్రా!'

'ఆ! ఆ! ఔనండీ! ఔను, ఔను. ఇప్పుడు జ్ఞాపకంవచ్చింది. మీరు తడిసివచ్చారు ఒకరోజు. ఔను, మీరు తడిసివచ్చారు. కానీ బాబుగారూ, నాకుబాగాగుర్తుండీ,నేను గంటకొట్టడానికివెళ్ళినప్పుడండీ ఆగంటను తాకగానే నా చెయ్యిచుర్రుమంది.'

'అయినా నువ్వొక మందమతివిరా, ఈ చిన్న చిన్న విషయాలుకూడాగుర్తులేకపోతేఎలాగురా.'

'పోనీ, ఎండాకాలంలో వానకురిసిన రోజను కోరాదూ?' అన్నాడు రామం.

'అలాగనుకుంటే అది వట్టి వేళ్ళ తడికో, లేక వెదుళ్ళతడికో అనేది ఎలాతేల్తుంది చెప్పు.'

'ఆ! గుర్తొచ్చింది బాబూ. అది వెదుళ్ళతడిక' అని అందిచ్చేడు వెంకడు.

'వెదుళ్ళతడిక అయితే నీచెయ్యి ఎల్లా కాలిందిరా? వెదుళ్ళతడిక శీతాకాలములో కాదుట్రా వేసేది. అది వట్టి వేళ్ళతడికే అయివుండాలి' అన్నారు పుల్లయ్యగారు.

'అయినా ఆతడికకూ, మీకథకూ సంబంధమేమన్నా వుందాండీ?' అని అడిగేను నేను.

'ప్రతిదానికీ సంబంధమేర్పరుస్తూ కూర్చోవోయ్ నువ్వు? ఇదే నీపని.'

'అది కాదండీ, మనకథ నడవడానికని చెప్పేను. అంతే. కోప్పడకండీ' అని ప్రాధేయపడ్డాను.

'ఇందులో కోపానికేముందోయ్? ఆనాటి విషయాలన్నీ గుర్తు తెచ్చుకొని, మీకు నాకథ విని పిద్దామనుకున్నా గానీ. ఇప్పుడు అదేదో తడిక అనుకుందాము. వెదురూవద్దూ, వట్టి వేళ్ళూవద్దూ. అక్కడ తడికేలేదు అనుకుందాము. సరేనా' అని అడిగేరు పుల్లయ్యగారు అందరివేపూ చూస్తూ.

'చాలా మంచిపని అది. కానివ్వండి మీ కథ' అన్నాడు రామం.

'సాగించండి' అన్నాను నేను.

'ఆరోజు ప్రొద్దున నాకు బాగా గుర్తుంది, నా జేబులో పెట్టున్నాను. అది పలకలదా, గుండ్రందా? పలకలదే నేమో! పలకలదా? ఆ! గుర్తొచ్చింది. గుండ్రంది. కాదు. కాదు. అది వీనస్ కాదుటోయీ, వెంకయ్యా?'

'ఆ! ఏమన్నారూ?' అన్నాడు గుర్రుపెట్టి నిద్రపోతూన్న వెంకయ్య.

'ఏమినిద్దరా, పాడునిద్ర. ఆ రోజునే తెచ్చింది వీనస్ కాదూ?'

'వీనస్ ఏమిటండీ! వీనస్సూ, మార్సూనూ' అన్నాడు రామం.

'అదికూడా తెలియదుటోయీ? ఏం పిల్లలో ఈకాలపువాళ్లు. వీనసుఅనేది పెన్సిలుమార్కు' అన్నారుమహాధీమాగా పుల్లయ్యగారు.ఇది పెన్సిలు గొడవ కామోసు అనుకొని' సరేనండే, అది వీనస్సో-కోహినూరో-ఏదో ఒకటి. కథకానిద్దురూ.'

'కథకథ, ఇదేగోల. అసలు సంగతులన్నీ చెప్పక పోయ్యాక కథ మాత్రం ఎందుకోయి. నీకు కథే కావలిస్తే, ఇదుగో విను' అని గుక్కతిప్పుకోకుండా ప్రారంభించారు పుల్లయ్యగారు.

'నేను ఆ రోజు ఇంట్లో బయల్దేరే ముందు పెన్సిలు నొకదాన్ని వీనస్సో, కోహినూరో; కాపీయింగో, వట్టిదో; హార్డో, సాఫ్టో తీసిజేబులో పెట్టుకున్నా. 10-45కో, 10-20కో, 10-50కో ఆఫీసుకివచ్చాను. వెంకట్రామయ్యగారో, వెంకటేశ్వరయ్యంగారో కబురుచేశారు. వెంకడో, సుబ్బడో కబురు తెచ్చాడు. అది ఎండాకాలమో, శీతాకాలమో గుర్తులేని మూలాన్ని గదికి కట్టబడివున్నది వట్టి వేళ్ళ తడికో, వెదురు బద్దలతడికో తెలియటములేదు. ఆ గది వుత్తరందో, దక్షిణాందో, తూర్పుదో, పడమటిదో, ఏదో, లోపలికి వెళ్ళిన తర్వాత నాకేదో చెప్పేరు, ఆయన. దాన్ని కాగితముమీదనో, ఇంకెక్కడనో రాసుకున్నా. సాయంత్రము ఇంటిదగ్గరనో, దార్లోనేనో జేబులో చూసుకుంటే పెన్సిలు కన్పించలేదు. ఎక్కడపడిపోయిందా అనుకుంటూండగా, మరునాడో, ఆ మరునాడో ఆఫీసరు కోటు జేబులోనో, చొక్కా జేబులోనో, ఫలానా అని గుర్తులేదు కానీ, ఈ రెండు స్థలాలలో ఒకచోట చూశాను. అది అక్కడ కెట్లాపోయిందా అనేది ఇప్పటికీ సమస్యే. వెంకయ్యా, దీన్ని నువ్వేమయినా తీరుస్తావట్రా' అని ఆపేరు పుల్లయ్యగారు.

మేమందరమూ ఒక్కక్షణము సేపు ఆశ్చర్యనిమగ్నులమై, మరో క్షణానికల్లా విరగబడినవ్వడం ప్రారంభించాము. ఆ నవ్వులో-

'నాకు గుర్తులేదండీ, బాబుగారూ' అన్న వెంకడి జవాబు విన్పించింది